



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:25 (బుధ)
సహరి : 4:40 (గురు)



వీరవాసరంలో తహసీల్దార్ ఆఫీసులో నగదు అప్పగిస్తున్న పోలీసులు

లెక్క చూపని సొమ్ము స్వాధీనం

- కుముదవల్లి వద్ద రూ.10 లక్షలు..
- భువ్వనపల్లిలో 1.50 లక్షలు
- రెండు చోట్ల రూ.1,08,500
- వీరవాసరంలో రూ.లక్ష స్వాధీనం -7లో



నేటితో ముగియనున్న టెన్త్ మెయిన్ పరీక్షలు

భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 26 : పదో తరగతి పబ్లిక్ మెయిన్ సబ్జెక్ట్స్ పరీక్షలు బుధవారంతో ముగియనున్నాయి. ఈ నెల 18 నుంచి ప్రారంభమైయిన టెన్త్ పరీక్షలు 27 వరకు మెయిన్ సబ్జెక్ట్ పరీక్షలు, 28న సంస్కృతం, 30న ఒకేషనల్ పరీక్ష జరగనుంది. జిల్లాలోని 127 కేంద్రాల్లో జరిగిన పరీక్షల్లో ఎక్కడా మాస్ కాపీయింగ్, ఇతర ఇబ్బందులు లేవన్నారు. మంగళవారం బయలాజికల్ సైన్స్ పరీక్ష 21,228 మంది హాజరుకాగా, 759 మంది గైర్హాజరు. సోషల్ పరీక్ష బుధవారం నిర్వహించనున్నారు. టెన్త్ జవాబు పత్రాల ముల్యాంకనం వచ్చే నెల 1 నుంచి నిర్వహించనున్నారు.

పాత నేరస్థులపై పోలీస్ నిఘా

- 2,900 మంది బైండోవర్..
- పెండింగ్ అరెస్టులపైనా చర్యలు

భీమవరం క్రైం, మార్చి 26 : సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్లల్లో ఇప్పటి వరకు 2,900 మంది అనుమానితులను బైండోవర్ చేశారు. వీరిలో 166 మంది రౌడీషీటర్లు ఉన్నారు. ఈ రౌడీషీటర్లకు ప్రతీ ఆదివారం ఉదయం కౌన్సెలింగ్ ఇస్తున్నారు. వారి నడవడికలపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఎన్నికల్లో అలజడి సృష్టించే విధంగా ఏ విధమైన నేరాలకు పాల్పడతారని సమాచారం వచ్చినా వారిపై చర్యలకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని పెండింగ్ కేసులు, పెండింగ్ అరెస్టులపై పోలీస్ ఉన్నతాధికారులు ఆరా తీశారు. ఆ కేసుల్లో ఏమైనా అరెస్టులు పెండింగ్ ఉన్నాయా ? ఉంటే వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. గత ఎన్నికల నేపథ్యంలో అల్లర్లు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారిపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. వారిపై సస్పెక్ట్ షీట్లు ఉన్నప్పటికీ బైండోవర్ చేశారు.

స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

పోలింగ్ అనంతరం ఈవీఎంలను భద్రపరిచే భీమవరంలోని స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ కేంద్రాలలో భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ వి.అజిత మంగళవారం పరిశీలించారు. అధికారులకు భద్రతాపరమైన పలు సూచనలు చేశారు. కౌంటింగ్ నిర్వహించే గదులను, ప్రాంగణాన్ని పరిశీలించి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, భద్రతకు కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. ఆమె వెంట ఏఎస్పీ వి.భీమారావు, ఎస్ఈబీ ఏఎస్పీ ఏటీవీ రవికుమార్, డీఎస్పీ వి.నారాయణ స్వామి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



భీమవరం కౌంటింగ్ కేంద్రంలో ఎస్పీ పరిశీలన

కోడ్ ఉల్లంఘన.. ఉపాధ్యాయుడి సస్పెన్షన్

చింతలపూడి, మార్చి 26 : ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన చింతలపూడి మండలం కంచెనగూడెం పాఠశాల ఉపాధ్యాయుడు కె.చెంచంరాజును డీఈవో ఎస్.అబ్రహం మంగళవారం సస్పెండ్ చేశారు. ఓ పార్టీ పథకాలపై చెంచంరాజు మాట్లాడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై ఎంపీడీవో రాటాలు, ఎంఈవో జి.రామారావు విచారించి నివేదిక పంపారు. ఈ మేరకు సస్పెండ్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

మేమున్నామని..

బాధిత కుటుంబాలకు భువనేశ్వరి భరోసా

నిజం గెలవాలి పేరిట పలువురికి పరామర్శ

- ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని వెల్లడి
- రాష్ట్రంలో ఎక్కడ చూసినా దౌర్జన్యాలే
- జగన్ అరాచక పాలనను సాగనంపాలని పిలుపు

ఏలూరు/కొయ్యలగూడెం/జంగారెడ్డిగూడెం/టీ.నరసాపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): 'తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షానే ఉంటుంది. మీకు కష్టాలు ఎదురైనప్పుడు తోడుండేది తెలుగుదేశమే. చంద్రబాబు మీద అక్రమ కేసులు బనాయించారు. రకరకాల ఆరోపణలు చేస్తూ రోజుకొక కట్టుకథ అల్లారు. ఆయనతోపాటు కార్యకర్తలను దండించారు. ఇప్పటికైనా ఈ అరాచక పాలన పోవాల్సిందే' అని నారా భువనేశ్వరి స్పష్టం చేశారు. 'నిజం గెలవాలి' పేరిట భువనేశ్వరి మంగళవారం ఏలూరు జిల్లా కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల్లో పర్యటించారు. భువనేశ్వరి ఉదయం రాజమండ్రి విమానాశ్రయం నుంచి నేరుగా కన్నాయిగూడెంలోని దిర్శిపోం వెంకటలక్ష్మి, ఎర్రంపేటలో చంద్ర చినకన్నయ్య, పేరంపేటలో భీమడోలు వెంకయ్య, జంగారెడ్డిగూడెంలో నల్లజర్ల కృష్ణ కుటుంబాలను పరామర్శించారు. ఆయా కుటుంబ సభ్యుల కన్నీటి పర్యంతం కాగా, భయం లేదు.. పార్టీ అండగా ఉంటుందంటూ భుజం తట్టి ఓదార్చారు. పార్టీ పక్షాన అన్ని విధాలా మీకు తోడుగా వుంటామని చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'మాదక ద్రవ్యాలు, నాసిరకం మద్యం, ప్రజల ప్రాణాలు తీస్తున్నాయి. రాష్ట్రానికి అత్యవసరమైన పోలవరం ప్రాజక్టు నిర్మాణంలో చంద్రబాబు ఎంతో చొరవ చూపించారు. ఈ నాలుగేళ్లలో వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసింది. బాధిత కుటుంబాలన్నీ సాధారణ, మధ్యతరగతి కుటుంబాలని వీరితోపాటు మిగతా కుటుంబాలు రాష్ట్రంలో అరాచక పాలనకు సాక్షులుగా ఉన్నారు. రాష్ట్ర భవిష్యత్ చంద్రబాబుతోనే సాధ్యం' అని ఆమె పర్యటించిన చోటల్లా చెప్పారు. అరాచక పాలన నుంచి పారద్రోలాలని పిలుపునిచ్చారు. భువనేశ్వరి ఆయా కుటుంబాలను పరామర్శిస్తున్న సమయంలో కొందరు భావోద్వేగంతో కన్నీటి పర్యంతం అయ్యారు. అందరినీ ఆమె ఓదార్చి ధైర్యం చెప్పారు.

ఆమె వెంట మాజీ మంత్రి పీతల సుజాత, మాజీ ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, ఘంటా మురళి, గన్ని వీరాంజనేయులు, మొడియం శ్రీనివాస్, ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్, చింతలపూడి, పోలవరం అభ్యర్థులు సొంగా రోషన్‌కుమార్, చిర్రి బాలరాజు, పోలవరం టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్‌చంద్ర, మండవ లక్ష్మణరావు, షేక్ ముస్తఫా, పెనుమర్తి రామ్‌కుమార్, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, రాజాన సత్యన్నారాయణ, బొబ్బర రాజ్‌పాల్‌కుమార్, పారేపల్లి నరేష్, పారేపల్లి రామారావు, సురేష్, సోంబాబు, ముడియం సూర్యచంద్రం తదితరులు పాల్గొన్నారు.

నేడు భువనేశ్వరి పర్యటన ఇలా..

భువనేశ్వరి మంగళవారం రాత్రి చింతలపూడిలోని 'కె' కన్వెన్షన్‌లో బస చేశారు. రెండో రోజు పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం పదిన్నర గంటలకు టి.నరసాపురం మండలం మక్కినవారిగూడెంలో మృతి చెందిన కార్యకర్త అబ్బదాసరి కృష్ణ నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శిస్తారు. మధ్యాహ్నం 1.15 గంటలకు తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లిలో కార్యకర్త కుటుంబాన్ని పరామర్శిస్తారు. మధ్యాహ్నం మూడు గంటలకు పెంటపాడు మండలం పశ్చిమ విప్పర్రులో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తారు. 3.55 గంటలకు నిడమర్రులో కార్యకర్త కుటుంబాన్ని పరామర్శిస్తారు.





జంగారెడ్డిగూడెం మహిళలకు అభివాదం

యర్రంపేటలో చిన్నకన్నయ్య కుటుంబ సభ్యులకు భువనేశ్వరి పరామర్శ




నల్లజాక కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నమస్కరిస్తున్న భువనేశ్వరి



బయ్యన్నగూడెంలో మార్గాని వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న భువనేశ్వరి



పేరంపేటలో భీమడోలు వెంకన్న కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న భువనేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

పదేళ్లుగా రాష్ట్రాభివృద్ధి లేదు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

భీమవరం అర్బన్, మార్చి 26 : రాష్ట్రం పదేళ్లుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు భీమవరం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. 'వైసీపీ బీజేపీ తొత్తుగా, టీడీపీ బీజేపీ పొత్తులో ఉంది. వీరిని ఓడిస్తేనే రాష్ట్రం ముందుకు సాగుతుంది. పదేళ్లలో రాష్ట్రానికి ఎలాంటి పరిశ్రమలు రాకపోయినా.. వీటి పేరు చెప్పి భూములు తీసుకున్నారు. సీట్లు కొనుక్కుంటున్న నాయకులకు ఎన్నికల్లో పోటీ చేసే అర్హత లేదు. ఇండియా కూటమిలో వున్న పార్టీలతో రాష్ట్రంలో సీపీఎం సీపీఐలు కొన్ని సీట్లు సర్దుబాటు చేసుకున్నాం. పదేళ్లుగా అసెంబ్లీలో ప్రజల కోసం మాట్లాడేవారు, పోరాడేవారు లేరు. సీపీఎం బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలి' అని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, జెఎన్‌వీ గోపాలన్, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకూడదు

భీమవరం టౌన్, మార్చి 26 : జిల్లావ్యాప్తంగా ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికా రులను ఆదేశించారు. వేసవిలో తాగునీటి సరఫరాపై సంబంధిత శాఖల అధికారులతో మంగళ వారం కలెక్టరేట్‌లో జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్యతో కలిసి సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 'వేసవిలో తాగు నీటి ఎద్దడి నివారణకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలి. కాల్వలు కట్టేలోపు తాగు నీటి చెరువులను నింపాలి. తాగునీటి పనులు ఏవీ పెండింగ్ ఉంచరాదు. అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నాయి. ఎక్కడైనా నీటి సరఫరా జరగకపోతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి' అని సూచించారు. ఇరిగేషన్ ఈఈ దక్షిణామూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ బీఈ నాగేశ్వరరావు, భీమవరం మున్సిపల్ కమిషనర్ శ్యామల, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి కరెంట్ కట్‌తో నిలిచిన సేవలు

ఆకివీడు, మార్చి 26 : విద్యుత్ శాఖకు బకాయిలు చెల్లించకపోవడంతో ఆకివీడు నగర పంచాయతీ కార్యాలయానికి కరెంట్ కట్ చేయడంతో మంగళవారం సేవలు నిలిచిపోయాయి. ఇంటి, కుళాయి తదితర పన్నులు వసూలు కట్టించుకోలేదు. దీంతో వచ్చిన వారు తిరిగి వెళ్లిపోయారు. ఈ నెలాఖరుకు బిల్లులు చెల్లిస్తామని మున్సిపల్ అధికారులు లేఖ ఇవ్వడంతో సాయంత్రం సరఫరాను పునరుద్ధరించినట్లు ఏఈ ప్రదీప్ తెలిపారు. మిగిలిన పంచాయతీ అధికారులు ఇదే విధంగా కోరడంతో కరెంటు ఇచ్చామన్నారు.

తెల్లారిన బతుకులు

- బైక్‌ను తప్పించబోయి మూడు పల్టీలు కొట్టిన ఆటో..
- ఇద్దరి మృతి.. ముగ్గురికి తీవ్ర గాయాలు



ఆగిరిపల్లి, మార్చి 26 : కాయ కష్టం చేసుకునే మహిళా రైతు కూలీలకు తెల్లవారక ముందే ఆటో రూపంలో మృత్యువు కబళించింది. ఆటో ప్రమాదంలో ఇద్దరు మహిళ లు మృతి చెందగా మరో మహిళ తీవ్రంగా గాయపడింది. ఆగిరిపల్లి మండలం సర్నాలగొల్లగూడేంకు చెందిన 22 మంది మహిళలు మంగళవారం ఉదయం 6.30 గంటలకు ఒకే ఆటోలో గన్నవరం మండలం వెంపల్లికి పత్తి తీతకు బయల్దేరారు. వీరపనేనిగూడెం సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి ఆటో అదుపు తప్పి మూడు పల్టీలు కొట్టింది. వీర్ల సుజాత(33) వీర్ల కృష్ణకుమారి(48) మృతి చెందారు. తీవ్ర గాయపడిన బడుగు శివమ్మ(46), సాకిరి నాగమణి, గుండ్రు పద్మావతిలను విజయవాడ ఆసుపత్రులకు తరలించారు. మిగిలిన వారికి పిన్నమనేని సిద్ధార్థ, నూజివీడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గన్నవరం మండలం ఆత్కూరు ఎస్ఐ పైడిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇప్పుడేం చేద్దాం

- ఎంపీ రఘురామకృష్ణరాజు విషయంపై చర్చ
- ఆర్థిక వనరులు, క్షేత్ర స్థాయిలో పరిస్థితులపై తర్జనభర్జన
- పలు అంశాలు చంద్రబాబు, పవన్‌ల దృష్టికి తీసుకెళ్లాలి
- కూటమి సమన్వయంతో ముందుకు సాగేలా ప్రణాళిక
- ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల సమావేశం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

గెలుపే లక్ష్యంగా టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులు అడుగులు వేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఉమ్మడి సమావేశాలు ఏర్పాటు చేసి సమన్వయంతో ముందుకు వెళుతున్నారు. మరోవైపు నరసాపురం ఎంపీ స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ రఘురామకృష్ణంరాజును పోటీలో నిలుపుతారని అంతా ఆశించినప్పటికీ కూటమి తరఫున బీజేపీ అభ్యర్థిగా భూపతిరాజు శ్రీనివాస్‌వర్మను ప్రకటించడంతో చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల టీడీపీ-జనసేన అభ్యర్థులు మంగళవారం ఆచంటలో సమావేశమయ్యారు. ఆచంట, పాలకొల్లు, ఉండి, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం అభ్యర్థులు మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, ఎమ్మెల్యేలు నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్యేలు పులపర్తి అంజిబాబు, ఆరిమిల్లి రాధాకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్ హాజరయ్యారు. సమావేశంలో కూటమి తరఫున ఎంపీ అభ్యర్థి విషయమై చర్చకు వచ్చింది. ఇప్పటి వరకు రఘురామకృష్ణంరాజు పోటీ చేస్తారని అంతా భావించారు. ప్రజల్లోనూ అదే భావన ఏర్పడింది. తాడేపల్లిగూడెంలో టీడీపీ-జనసేన ఉమ్మడి జెండా సభలోనూ తానే పోటీ చేస్తానని చంద్రబాబు, పవన్ కల్యాణ్ సమక్షంలో ఆయనే స్వయంగా ప్రకటించుకున్నారు. ఇప్పుడు బీజేపీ తరఫున శ్రీనివాసవర్మను ప్రకటించారు. దీనిపై చర్చించారు. అలాగే ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులను ఎలా ఢీకొట్టాలి ? ఆర్థిక వనరులపై ఏం చేయాలి ? పొత్తులో భాగంగా ఓట్ల ట్రాన్స్‌ఫర్, అసంతృప్తులతో చర్చలు మొదలైన అంశాలపై సమావేశంలో చర్చకు వచ్చింది. ప్రస్తుతం మారిన రాజకీయ సమీకరణలతో ఆర్థిక వనరుల అంశం ప్రధానంగా మారాయి. మరోవైపు తణుకులో జనసేన ఇన్‌ఛార్జ్ నుంచి సహకారం లేకపోవడం ప్రస్తావనకు వచ్చింది. ఈ విషయాలను టీడీపీ, జనసేన అధినేతల దృష్టికి తీసుకువెళ్లే బాధ్యతను ఇరుపార్టీల అధ్యక్షులకు అప్పగించారు. మరోవైపు టీడీపీ ఎమ్మెల్యేలతో చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి, ఆర్థిక వనరులపై ఎమ్మెల్యేలు ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు. మరోవైపు ఏడుగురు అభ్యర్థులు చంద్రబాబుతో భేటీ కావాలన్న నిర్ణయించారు. మరోవైపు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్న తలంపుతో ఉన్నారు. ఈ కూటమి అభ్యర్థుల సమావేశంపై రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. కూటమి ఎంపి అభ్యర్థి ప్రకటించిన తర్వాత వీరంతా ఒక చోట భేటీ కావడం జనంలో చర్చ సాగుతోంది. సమావేశంలో చర్చించే అంశాలను అభ్యర్థులు గోప్యంగా ఉంచారు.

మాగంటికి బుజ్జగింపు



అసంతృప్తి చల్లార్చే ప్రయత్నాలు.. ఇంకోవైపు గోపాల్ యాదవ్ జంప్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఏలూరు పార్లమెంట్ స్థానంలో రాజకీయాలు చిత్రవిచిత్రంగా మారుతున్నాయి. ఇంకోవైపు సీనియర్లను బుజ్జగించడానికి తంటాలు పడుతున్నారు. టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ మాగంటి బాబు తీవ్ర అసంతృప్తితో వున్నారు. పార్టీలో సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న సీనియర్ అయిన తనను పెద్దగా పట్టించుకోవడం లేదని, ఆఖరుకు ఏలూరు లోక్‌సభ స్థానం అభ్యర్థిని ఖరారు చేసినా, మాట వరసకైనా తనను సంప్రదించలేదనే ఆవేదనతో ఆయన ఉన్నారు. గడచిన మూడు రోజులుగా మాగంటి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండడంతో ఆయన పార్టీ మారడం ఖాయమని జిల్లాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. దీనికి తోడు మాగంటి బాబును ఆకర్షించేందుకు వీలైతే పార్టీలో చేర్చుకునేందుకు వైసీపీ నేతలు రాయబారానికి దిగారు. వాస్తవానికి గతంలో రాజశేఖర రెడ్డి మంత్రివర్గంలో మాగంటి బాబు ఉన్నప్పుడు అప్పట్లో జరిగిన ఓ ఎన్నిక ఫలితం ప్రతికూలంగా రావడంతో ఆయనను అప్పటికప్పుడు మంత్రివర్గం నుంచి తప్పించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాబు టీడీపీలో చేరారు. ఎంపీగా పలుమార్లు పోటీ చేశారు. రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన ఆయన అనేక నియోజక వర్గాల్లో తనకంటూ ఒక ముద్ర వేసుకున్నారు. అలాంటి ఇమేజ్ ఉన్న సీనియర్ నేత పట్ల పార్టీ అవమానకరంగా ప్రవర్తించిందని, ఆయన సేవలు అక్కర్లేక పోతే తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉండవలసిందని ఇప్పుడు మాగంటి అభిమానులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. తొలుత ఏలూరు ఎంపీ స్థానాన్ని ఆయన కూడా ఆశించారు. క్రమక్రమంగా ఆయనను తప్పించి బీసీ నినాదం అందుకున్నారు. దీని ఫలితంగానే మహేష్ కుమార్ యాదవ్‌ను అభ్యర్థిగా ఎంపిక చేశారు. ఇలాంటి పరిణామాల నేపథ్యంలో మాగంటి బాబు ఆయన అనుచర వర్గం కొంత అసంతృప్తిలో మునిగిపోయారు. పార్టీ సీనియర్లు సైతం దూరంగా ఉండడం పార్టీలో అత్యున్నత బాధ్యతలో ఉన్నవారు తమకేం పట్టనట్టు వ్యవహరించిన కారణంగానే మాగంటి బాబు మనస్తాపానికి గురయ్యారనే సమాచారం బయటకు పొక్కింది. ఆ వెనువెంటనే వైసీపీ నేతలు రంగంలోకి దిగారు. ఒకానొక దశలో ఎంపీ స్థానానికి బాబును ఎంపిక చేస్తారని ఇప్పటికే రంగంలో వున్న సునీల్ కుమార్‌ను తప్పిస్తారంటూ ప్రచారం జరిగింది.



ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ టిక్కెట్ ఆశించిన గోరుముచ్చు గోపాల్ యాదవ్ మంగళవారం పార్టీ మార్చేసి వైసీపీలో చేరిపోయారు. తనకు టిక్కెట్ ఇవ్వకపోవడంతోపాటు అవమానకర రీతిలో ప్రవర్తించారని, దీనికి విరుగుడుగానే వైసీపీలో చేరినట్టు గోపాల్ యాదవ్ ప్రకటించారు.

బుజ్జగింపులు ఆరంభం

అసంతృప్తి, ఆవేశంలో వున్న సీనియర్ నేత మాగంటి బాబును తెలుగుదేశం బుజ్జగించే పనిలోపడింది. మాగంటి ప్రభావం పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బలంగా ఉన్నందున, ఎట్టి పరిస్థితిలోనూ ఆయన తీవ్ర నిర్ణయాలు తీసుకోకుండా జాగ్రత్తపడుతోంది. పార్టీ సీనియర్లు ఇప్పటికే రంగంలోకి దిగారు. మాగంటి బాబును సముదాయించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆయన అనుకూలురు మాత్రం సరైన నిర్ణయం తీసుకోవాల్సిందిగా బాబుపై ఒత్తిడి పెంచారు. ఏలూరు లోక్‌సభ స్థానంలో టీడీపీలో వున్న సీనియర్లు కూడా తాజా పరిణామాలపై దృష్టి పెట్టారు.




రంగులు తొలగించారు..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెంటపాడు, మార్చి 26: వైసీపీ రంగుల మాటేంటి శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పట్టణంలోని 23వ వార్డు చిన ముత్యాలమ్మ ఆలయం వద్ద రేవుకు, శిలాఫలకానికి వేసిన వైసీపీ రంగులు తొలగించారు.

ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ ప్రశాంతిలకు మెడల్స్

డీఎస్పీ, ఇతర సిబ్బందికి కాంస్య పతకాలు


ఐజీ అశోక్‌కుమార్


ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు క్రైం, మార్చి 26 : శాంతి భద్రతలు కాపాడడంలో, కేసుల దర్యాప్తు, పరిపాలనా పరమైన అంశాలపై పరిశీలన జరిపి రాష్ట్రస్థాయిలో ఐపీఎస్ అధికారులకు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బందికి రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి అవా ర్డులను ప్రకటించారు.ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌కు రాష్ట్రస్థాయిలో గోల్డ్ విభాగంలో ఎంపికై అవార్డు పొందారు. ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి సిల్వర్ విభాగంలో ఎంపికయ్యారు. ఐపీఎస్ అధికారి అశోక్‌కుమార్ ఏలూరు రేంజ్ డీఐజీగా 2023 ఏప్రిల్ 12వ తేదీన బాధ్యతలు చేపట్టి ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి ఏలూరు రేంజ్ ఐజీగా విధులను నిర్వర్తిస్తున్నారు. రేంజ్ పరిధిలో ఏ సంఘటన జరిగినా స్వయంగా పరిశీలించి కేసుల దర్యాప్తు వేగవంతం చేశారు. మేరీ ప్రశాంతి 2023 ఏప్రిల్ 12న జిల్లా ఎస్పీగా ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. జిల్లాలో శాంతి భద్రతలు కాపాడడంలో మేరీ ప్రశాంతి ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు చేపట్టారు. స్పందన కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టారు. గతంలో ఏలూరు దిశ డీఎస్పీగా పనిచేసిన కేవీ సత్యనా రాయణకు, డీసీఆర్బీ ఏఎస్ఐ రమేష్‌బాబు, స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ వెంకట సత్యనారాయణ, ఏలూరు సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు, బుట్టాయిగూడెం కానిస్టేబుల్ బాలకృష్ణ, ఏలూరు జిల్లా కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ (పిసి 991), కానిస్టేబుల్ బాలకృష్ణ (పీసీ 2136), ఏలూరు దిశ పోలీస్‌స్టేషన్ మహిళా హెడ్ కానిస్టేబుల్ వెంకటరమణ (డబ్ల్యుహెచ్‌సి 367)లకు బ్రౌంజ్ మెడల్ ప్రకటించారు.



విద్యార్థులకు బంగారు పతకాలను అందిస్తున్న కంభంపాటి హరిబాబు

విద్యార్థులు కొత్త ఆలోచనలతో పరిశ్రమలు స్థాపించాలి

మిజోరం రాష్ట్ర గవర్నరు డాక్టర్ కంభంపాటి హరిబాబు

భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 26 : భారతదేశం ప్రపంచానికి ధీటుగా ఎంతో అభివృద్ధి సాధించిందని మిజోరం రాష్ట్ర గవర్నరు డాక్టర్ కంభంపాటి హరిబాబు అన్నారు. మంగళవారం భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల 44వ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఏదో ఒక దాంట్లో నైపుణ్యం సంపాదించి బయటికి రావాలని సూచించారు. డీఆర్‌డీఏ వంటి సంస్థల్లో జరుగుతున్న పరిశోధనలు పరిశీలించి ఆ రంగంలో నైపుణ్యం సాధించే విధంగా కృషి చేయాలన్నారు. విద్యార్థులు కొత్త ఆలోచనలతో నూతన పరిశ్రమల స్థాపన చేయాలని కోరారు. ఏఐసిటీఈ ఐడియా ల్యాబ్స్ సందర్శించి అక్కడ పరిశోధకులతో మాట్లాడారు. కళాశాల అధ్యక్షుడు సాగి ప్రసాదరాజు, సెక్రటరీ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మలు మాట్లాడుతూ తమ కళాశాల అత్యున్నత ప్రమాణాలు కలిగిన విద్యా సంస్థగా అభివృద్ధి చెందిందన్నారు. హరిబాబు చేతుల మీదుగా కళాశాల వ్యవస్థాపకుడు దివంగత సాగి రామకృష్ణంరాజు పేరిట పోస్టల్ ప్రత్యేక కవరు విడుదల చేశారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలు అందించారు. కళాశాల గౌరవ ఛైర్మన్ కృష్ణంరాజు, డైరెక్టర్ జగపతిరాజు, ప్రిన్సిపాల్ మురళీకృష్ణంరాజు, కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు రామరాజు, ఎస్వీ రంగరాజు, పాలకవర్గ సభ్యులు విజయ నరసింహరాజు, టెక్నాలజీస్ సీఈవో వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.


సుమలతను సత్కరిస్తున్న ఆచార్యులు, సిబ్బంది

ప్రతి విద్యార్థిని ఉన్నత స్థానాలకు ఎదగాలి

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 26 : ప్రతీ విద్యార్థిని ఉన్నత స్థానాలకు ఎదగాలని కాకినాడ జేఎన్టీయూ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.సుమలత అన్నారు. ఏపీ నిట్‌లోని నేచర్ వేల్యూ ఎడ్యుకేషన్ క్లబ్ సహకారంతో సాంకేతికత, మహిళా సాధికారత అనే అంశంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. డాక్టర్ సుమలత మాట్లాడుతూ మహిళలు ఆర్థిక , సామాజిక, రాజకీయ, వ్యాపార, శాస్త్ర , రంగాలలో పురుషులతో సమానంగా రాణిస్తూ దేశ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ప్రతీ విద్యార్థిని స్వశక్తితో స్వేచ్ఛగా ఆలోచనలు చేస్తూ ఎంచుకున్న రంగానికి వన్నె తీసుకురావాలన్నారు. మహిళల రక్షణ కోసం ఎన్నో యాప్‌లు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే సాంకేతికతను అందిపుచ్చుకుని నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ సుమలతను శాలువా, మెమెంటోతో సత్కరించారు. ఫ్యాకల్టీ ఇంచార్జి డాక్టర్ రాజేశ్వరరెడ్డి, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ హిమబిందు, క్లబ్ ప్రధాన కార్యదర్శి కృష్ణప్రియ పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 26 : ఇంటర్మీడియట్ పరీక్షల స్పాట్ వాల్యూయేషన్‌కు సంబంధించి బోటనీ, జువాలజీ, కామర్స్ సబ్జెక్టుల మూల్యాంకనను ఈనెల 28కి బదులుగా ఒకరోజు ముందుగానే అంటే 27వ తేదీ నుంచే ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభిస్తున్నట్టు డీవీఈవో ప్రభాకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. మూల్యాంకన విధులకు సంబంధిత సబ్జెక్టుల నుంచి నియమితులైన ఎగ్జామినర్లను ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు రిలీవ్‌చేసి పంపాలని ఆదేశించారు. ఈ సబ్జెక్టులకు స్క్రూటీనైజర్లుగా నియమితులైన సిబ్బంది 28న ఉదయం 10గంటలకు స్పాట్ క్యాంపునకు విధిగా హాజరుకావాలని సూచించారు. మూల్యాంకన విధులకు రిపోర్ట్ చేయని ఎగ్జామినర్లు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున ఇంటర్‌బోర్డు ఆదేశాల ప్రకారం సంబంధిత కళాశాల యాజమాన్యానికి పెనాల్టీ విధిస్తామని హెచ్చరించారు.

'పది' పరీక్షలు ప్రశాంతం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 26: పదో తరగతి పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన జీవశాస్త్రం పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసిందని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ విభాగంలో 24,131 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా 23,434 మంది, ప్రైవేటు విభాగంలో 5,285 మందికి 3,108 మంది హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 697 మంది, ప్రైవేటు విభాగం విద్యార్థులు 2,177 మంది గైర్హాజరయ్యారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు.

26-03-2024
పొగాకు ధరలు (రూ.)



పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	241	235	239.82
జంగారెడ్డిగూడెం-1	240	235	239.60
జంగారెడ్డిగూడెం-2	240	235	239.71
కొయ్యలగూడెం	240	235	239.32
గోపాలపురం	241	235	238.12




కుముదవల్లి ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీ.. ఉంగుటూరులో తనిఖీలు... భువ్వనపల్లిలో నగదు సీజ్ చేసిన ఎస్సై శ్రీను

లెక్క చూపని సొమ్ము స్వాధీనం

నగదు, మద్యం రవాణా అడ్డుకునేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు చేపడుతోంది..మంగళవారం వివిధ ప్రాంతాల్లో ఆధారాలు చూపని నగదును స్వాధీనం చేసుకున్నారు.

కుముదవల్లి వద్ద రూ.10 లక్షలు..

పాలకోడేరు, మార్చి 26 : కుముదవల్లి రైల్వేగేటు వద్ద వాహనాలను చెక్ చేస్తుండగా బైక్‌పై వెళ్తున్న వ్యక్తి నుంచి పది లక్షల రూపాయలు స్వాధీనం చేసుకున్నట్టు పాలకోడేరు మండల ఫ్లైయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్ ఎంఎస్ఆర్ ఆంజనేయులు తెలిపారు. ఏఎస్ఐ మోహనరావు, సిబ్బంది ప్రసాదు,కొండబాబులు వాహనాలను చెక్ చేస్తుండగా కుముదవల్లి నుంచి భీమవరం వైపు బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని చెక్ చేయగా అతని వద్ద రూ. 10 లక్షలు నగదు దొరికిందని తెలిపారు. మీనా బిస్కెట్ కంపెనీకి చెందిన నగదు అని బ్యాంక్‌కు తీసుకువెళ్తున్నామని చెప్పినప్పటికీ సరైన పత్రాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకుని ఉండి తహసీల్దార్ కార్యాలయం సిబ్బందికి అప్పగించినట్లు తెలిపారు.

భువ్వనపల్లిలో 1.50 లక్షలు

నిడమర్రు: నిడమర్రు మండలం భువ్వనపల్లిలో మంగళవారం ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా తీసుకువెళుతున్న 1.50 లక్షల నగదును సీజ్ చేసినట్లు ఎస్సై ఆర్.శ్రీను తెలిపారు. ఎఫ్ఎస్‌టి టీమ్ ఇన్‌చార్జి ఎస్.కె. హబీబ్ భాషా డీఈవో ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా భువ్వనపల్లి దుర్గమ్మ గుడి వద్ద సీతారామపురం నుంచి భీమవరం వైపు వెళ్తున్న కారులో 1.50 లక్షల నగదును నడింపల్లి రాజన్‌రాజు వద్ద నుంచి స్వాధీనం చేసుకుని సీజ్ చేసి ఏలూరు ట్రెజరీకి పంపినట్టు తెలిపారు.

రెండు చోట్ల రూ.1,08,500

ఉంగుటూరు: ఉంగుటూరు నియోజకవర్గంలో మంగళవారం మూడు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన తనిఖీలలో రూ.1.08,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు రిటర్నింగ్ అధికారి, ఏలూరు ఆర్డీవో ఖాజావలి తెలిపారు. ఉంగుటూరు గ్రామంలో రూ.53,500 నగదు, గణపవరం మండలం మొయ్యేరులో రూ.55000,

వీరవాసరంలో రూ.లక్ష స్వాధీనం

వీరవాసరం : వీరవాసరం-పెనుమంట్ర రహదారిలో ద్విచక్రవాహనంపై నగదు తీసుకువెడుతున్న యువకుల నుంచి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ రూ.లక్ష స్వాధీనం చేసుకొంది. పంజావేమవరం సాయిబాబా ఆలయం వద్ద తనిఖీ నిర్వహిస్తుండగా కోనసీమ జిల్లా మాచవరం గ్రామానికి చెందిన గెద్దాడ సూరిబాబు వద్ద నగదును గుర్తించారు. నగదుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని తహసీల్దార్ కార్యాలయంలో నగదు జప్తు చేశారు. స్క్వాడ్ సభ్యులు డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వరరావు ఏఎస్ఐ వీరభద్రరావు పాల్గొన్నారు.



అల్లిపల్లి చెక్‌పోస్టు వద్ద ఆర్టీసీ బస్సు, కారు తనిఖీ చేస్తున్న అదనపు ఎస్పీ స్వరూపరాణి



నూజివీడు సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

అక్రమ మద్యం కట్టడికి ప్రత్యేక బృందాలు

జిల్లా వ్యాప్తంగా రంగంలోకి దిగిన బృందాలు

చేపలు, రొయ్యల మేత, కోళ్ల వ్యర్థాల లోడుల్లో రవాణా

ఏలూరు క్రైం, మార్చి 26 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ మద్యం జిల్లాకు రానివ్వకూడదని ఎన్నికల సమయంలో ఓటర్లకు మద్యాన్ని ప్రలోభాలుగా చేయడానికి వీలులేకుండా జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి కట్టడి చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, ఎస్ఈబీ అదనపు ఎస్పీ సూర్యచంద్రరావుల ఆదేశాలతో ప్రత్యేక బృందాలను జిల్లాలో ఏర్పాటు చేశారు. గత ఎన్నికల్లో ఎక్కడెక్కడ అక్రమ మద్యం నిల్వలపై కేసులు నమోదు చేశారో ఆ కేసుల వివరాలు అందులోని ముద్దాయిల వివరాలు, ప్రస్తుతం వారి స్థితిగతులు ఏ పార్టీ నాయకునికి వారు ఉన్నారో వంటి వివరాలపై ఆరా తీస్తున్నారు. అంతేకాకుండా ఇప్పటికే జిల్లాకు పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి కొన్ని చేపల లోడు, కొన్ని రొయ్యల మేత, రొయ్య పిల్లల రవాణా ముసుగులో లారీలు, కంటైనర్లలో అక్రమ మద్యం జిల్లాకు వస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. అదే విధంగా తెలంగాణా రాష్ట్రం నుంచి కోళ్ల వ్యర్థాల లోడులలో ఈ అక్రమ మద్యం జిల్లాకు తీసుకువస్తున్నారని సమాచారం ఉండడంతో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశారు. గతంలో అక్రమ మద్యాన్ని తరలించే సమయంలో రవాణాను ఏ విధంగా వినియోగించారు. అందుకు ఎలాంటి వాహనాలు వినియోగించారు వంటి వాటిని అధికారులు పరిశీలన చేస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. త్వరలోనే జిల్లా సరిహద్దుల్లో కూడా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలకు చర్యలు చేపట్టనున్నారు.జిల్లా ఎన్నికల అధికారులు ఇప్పటికే ఆకస్మికంగా వివిధ చెక్‌పోస్టుల వద్ద ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి కూడా స్వయంగా ఏలూరు జిల్లా సరిహద్దులో ఉన్న తెలంగాణ రాష్ట్ర చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. జిల్లా అదనపు ఎస్పీ స్వరూపరాణి మంగళవారం సాయంత్రం చింతలపూడి మండలంలోని అల్లిపల్లి, లింగాయిగూడెం చెక్‌పోస్టులను పరిశీలించారు. గంజాయి, నాటుసారా, మద్యం, నగదు అక్రమ రవాణా జరుగకుండా స్వయంగా పరీక్షించి అక్కడ ఉన్న సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అక్రమ మద్యం జిల్లాకు వివిధ మార్గాల్లో వస్తుందన్న సమాచారంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వివిధ ప్రాంతాల్లో నిఘా ఉంచారు.

నియంత్రణకు ఉమ్మడి దాడులు

నూజివీడు, మార్చి 26 : ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ, ఏపీ సరిహద్దుల్లో ఉమ్మడి దాడులకు చర్యలు తీసుకోవాలని ఖమ్మం, ఏలూరు జిల్లాల అధికారులు నిర్ణయించారు. నూజివీడు సారథి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఇరు రాష్ట్రాలకు సంబంధించి అనధికార మద్యం నియంత్రణపై ఇంటర్ స్టేట్ కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఏలూరు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కె.రామకృష్ణ, అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు,ఖమ్మం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.నాగేంద్రరెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎన్.వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఏలూరు జిల్లా సరిహద్దులోని తెలంగాణ రాష్ట్ర ప్రాంతాల్లో అధికారిక బెల్టుషాపులు ఉండటంతో ఏలూరు జిల్లాలో అనధికారికంగా మద్యం రవాణాను అరికట్టడంలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. నేరుగా షాపుల నుంచి లిక్కర్ కొనకుండా బెల్టుషాపులో లిక్కర్ కొనుగోలు చేస్తున్న రవాణాదారులు, మద్యాన్ని సరిహద్దులు దాటిస్తున్నారని ఈ నేపథ్యంలో ఇరు రాష్ట్రాల అధికారులు ఉమ్మడిగా దాడులు చేయాల్సిన అవసరం ఉందని నిర్ణయించారు. అదేవిధంగా రాష్ట్రంలోకి తెలంగాణ, యానాం, గోవా నుంచి మద్యం రవాణా అవుతోందని, ప్రధానంగా గుడ్లు, చేపలు తదితర రవాణా లారీలలో రహస్యంగా ఉంచిన ర్యాక్‌లో మద్యం ఉంచి రవాణా చేస్తుండటంతో వాటిని పట్టుకోవడం కష్టంగా ఉందని, ఈ పరిస్థితిని నివారించేందుకు ప్రత్యేక నిఘాను కొన సాగిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. సత్తుపల్లి ఎక్సైజ్ సీఐ ని.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, నూజివీడు సెబ్ సీఐ రమణ, ఎస్సై కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీపుష్పయాగోత్సవం



ఆచంట, మార్చి 26: కొడమంచిలి వేంకటేశ్వరస్వామి తిరువార్షిక కల్యాణోత్సవాలు సోమవారం రాత్రి ముగిశాయి. ఆఖరి రోజున స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలతో పాటు పుష్పయాగోత్సవం, ముత్తదువులకు కుంకుమ భరణిలు పంచిపెట్టే కార్యక్రమాన్ని గ్రామానికి చెందిన చిలుకూరి అబ్బారావు, అనసూయ దంపతులచే వేడుకగా నిర్వహించారు. ఆధ్యాత్మిక గురువు మానేపల్లి ఉమా రామలింగేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కరుగోరుమిల్లి ర్యాంప్‌ను పరిశీలించిన మైనింగ్, పోలీసు, సెబ్ అధికారులు

ఆచంట, మార్చి 26: ఆచంట మండలం కరుగోరుమిల్లి ఇసుక ర్యాంప్‌ను మంగళవారం మైనింగ్, పోలీసు, సెబ్ , రెవెన్యూ అధికారులు పరిశీలించారు. కొన్ని రోజులుగా అనుమతులు ఉన్నాయంటూ పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. దీంతో ప్రతీరోజూ అనేక వాహనాలతో ర్యాంప్ రద్దీగా ఉంటున్నది.అధికారులు వెళ్లే సమయానికి ర్యాంప్‌లో ఇసుక తవ్వకాలు నిలిపివేశారు. తవ్వకాలు ఒక్కసారిగా నిలిపి వేయడంతో అసలు ఈ ర్యాంప్‌కు అనుమతులున్నాయా లేవా అనే అనుమానం కలుగుతోంది.అధికారులు జిల్లాలోని పరిశీలనలో భాగంగా కరుగోరుమిల్లి ర్యాంప్ కూడా పరిశీలించారు.

క్రైం కార్నర్

ఓవర్‌హెడ్ ట్యాంకు పైనుంచి పడి కార్మికుడిమృతి

పెదవేగి, మార్చి 26 : నిర్మాణంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు పైనుంచి పడి వ్యక్తి మృతి చెందాడు. దీనిపై కొప్పులవారిగూడెం వీఆర్వో సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ కేసు నమోదచేశారు.పెదవేగి మండలం కొప్పులవారిగూడెంలో కొత్తగా ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం చేపట్టారు. పెదపాడు మండలం ఏపూరు గ్రామానికి చెందిన తోట శ్రీను ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణ పనులకు వస్తున్నాడు. ట్యాంకు పైభాగాన సెంట్రింగ్ పనులు చేస్తుండగా మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు ట్యాంకుపై నుంచి కిందపడిపోయాడు. తలకు తీవ్రగాయం అవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

ఏలూరు క్రైం, మార్చి 26 : రాత్రివేళ అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురిని ఏలూరు త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు శనివారపుపేటకు చెందిన శిరిబత్తుల వరలక్ష్మి శనివారపుపేట మార్కెట్ వద్ద మద్యం బాటిల్స్ విక్రయిస్తుండగా త్రీటౌన్ సీఐ వెంకటేశ్వరరావు వారిని అరెస్టు చేసి పది మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు ఫిల్‌హౌస్‌పేటకు చెందిన అర్లగడ్డ సతీష్‌కుమార్ సత్రంపాడులో మద్యం బాటిల్స్ విక్రయిస్తుండగా అరెస్టు చేసి నాలుగు బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. పడమర వీధినకు చెందిన విఠాల రమేష్‌బాబు రామకృష్ణాపురం వద్ద మద్యం విక్రయిస్తుండగా అతనిని అరెస్టు చేసి ఆరు బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

చెవిటి, మూగ యువతిని మోసగించిన వ్యక్తిపై కేసు

పాలకోడేరు, మార్చి 26 : పుట్టకతోనే చెవిటి, మూగ అయిన యువతిని ప్రేమించానని, పెళ్ళి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేసి మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రమైన పాలకోడేరులోని కొత్తపేటకు చెందిన చెవిటి, మూగ యువతిని అదే గ్రామానికి చెందిన పెన్మెత్స దుర్గా సూర్యనారాయణ రాజు పెళ్లి చేసుకుంటానని చెప్పి అఘాయిత్యానికి పాల్పడ్డాడని తెలిపారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

పదోన్నతులు లేవు.. జీతాలూ లేవు..



తొమ్మిది నెలలుగా దేవదాయ శాఖ ఉద్యోగుల అవస్థలు

జూనియర్ అసిస్టెంట్లకు గ్రేడ్-3 ఈవోలుగా పదోన్నతులు

నిలిపివేసిన ఉన్నతాధికారులు

కోర్టుకు వెళ్లిన ఉద్యోగులు..అనుకూలంగా తీర్పు

భీమవరం టౌన్,మార్చి 26 :దేవదాయశాఖలో జూనియర్ అసిస్టెంట్లకు గ్రేడ్-3 ఈవోలుగా పదోన్నతులు ఇచ్చారు. దేవదాయ శాఖ అధికారులు వాటిని నిలిపివేశారు. ఉద్యోగులు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే వారికి అనుకూలంగా ఆదేశాలు వచ్చాయి. అయితే తొమ్మిది నెలలు కావొస్తున్నా వారికి పదోన్నతులు ఇవ్వలేదు.. జీతాలూ ఇవ్వడం లదు. తొమ్మిది నెలలుగా జీతాలు లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి అద్దె కట్టలేని పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవదాయశాఖలో జూనియర్ అసిస్టెంట్లుగా విధులునిర్వహిస్తున్న వారికి అర్హత ప్రకారం వారిని గ్రేడ్- 3 కార్య నిర్వహణ అధికారులుగా పదోన్నతులు కల్పిస్తూ 2023 జూన్ 27న ఉత్తర్వులు ఇచ్చారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 19 మంది అర్హులుగా ఉండటంతో వారికి పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు అందించారు. ఈ నియామకాలను నిలపుదల చేస్తూ అదే ఏడాది జులై 17న దేవదాయ ధర్మదాయశాఖ అధికారులు ఆదేశాలు జారీచేశారు. దీంతో వీరంతా హైకోర్టును ఆశ్రయించారు. తమకు అన్ని అర్హతలు ఉన్నాయని తమను పదోన్నతుల్లో కొనసాగించాలని కోరగా వారికి పదోన్నతులు కల్పించాలని ఆగస్టు 18న కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను కూడా ఖాతరు చెయ్యకపోవడంతో వీరంతా మరోసారి న్యాయస్థానంలో పిల్ వేశారు. ప్రభుత్వం రద్దుచేసిన ఉత్తర్వులను కొట్టివేసి పదోన్నతులు కల్పించాలని గత డిసెంబరులోనే ఆదేశాలు ఇచ్చింది. ఈ ఉత్తర్వులు ఇచ్చి మూడు నెలలు గడుస్తోంది. ఇప్పటికీ దేవదాయశాఖ అధికారులు ఈ వ్యవహారంలో నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నారంటూ ఉద్యోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

జీతాలు లేక నానా ఇబ్బందులు

అర్హతలు ఉండి కూడా పదోన్నతులు పొందలేకపోయామని,అధికారులు తమకు ప్రతికూలంగా వ్యవహరించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఉద్యోగులు వాపోతున్నారు. తొమ్మిది నెలలు అవుతున్నా జీతాలు లేకపోవడంతో ఆర్థికంగా అవస్థలు పడుతున్నామని ఇటు జూనియర్ అసిస్టెంట్లుగా కూడా విధులు నిర్వహించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు లేకపోవడంతో అప్పులు చేసి కుటుంబాన్ని నెట్టుకొ స్తున్నామంటున్నారు. తమకు న్యాయం చేయాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.

పలు రైళ్లు రద్దు..కొన్ని మళ్లింపు



ఏలూరు క్రైం మార్చి 26 : దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో మరమ్మతులు జరుగుతున్న కారణంగా ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొన్ని రైళ్లను రద్దు చేశారు.మరి కొన్ని రైళ్లను దారి మళ్లించారు.వాటి వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడ నుంచి ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా రాకపోకలను పూర్తిగా రద్దు చేశారు. ఈ రైళ్లు విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా మళ్లించారు.

రద్దయిన రైళ్లు ఇవీ..

17219 మచిలీపట్టణం-విశాఖపట్టణం ఏప్రిల్ 1 నుంచి 28 వరకూ రద్దు
17220 విశాఖపట్టణం-మచిలీపట్టణం ఏప్రిల్ 2 నుంచి 29 వరకూ..
22701 గుంటూరు- విశాఖపట్టణం ఏప్రిల్ 1 నుంచి 28 వరకూ
22702 విశాఖపట్టణం -గుంటూరు ఏప్రిల్ 1 నుంచి 28 వరకూ

దారి మళ్లించిన రైళ్లు

దారి మళ్లించిన రైళ్లు ఏలూరు, తాడేపల్లిగూడెంల మీదుగా వెళ్ళకుండా విజయవాడ నుంచి గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా రాకపోకలు కొనసాగించనున్నాయి.

22643 యర్నాకుళం జంక్షన్ - పాట్నా ఏప్రిల్ 1, 8, 15, 22 వరకూ
12756 భావనగర్ - కాకినాడ పోర్టు ఏప్రిల్ 6, 13, 20, 27 వరకూ
12509 ఎస్ఎంవి బెంగళూరు- గౌహటి ఏప్రిల్ 3, 5, 10,12,17, 19, 24, 26
11019 ఛత్రపతి శివాజీ టెర్మినల్-భువనేశ్వర్ ఏప్రిల్ 1, 3, 5, 6, 8, 10, 12, 13, 15, 17, 19, 20, 22, 24, 26, 27
13351 ధన్‌బాగ్ - అల్పాన్ ఏప్రిల్ 1 నుంచి 28 వరకూ
18111 టాటా - యశ్వంత్‌పూర్ ఏప్రిల్ 4, 11, 18, 25
12376 జాసిడ్డిత్ - తాంబ్రం ఏప్రిల్ 3, 10, 17, 24
22837 హర్దాయ్ - ఎర్నాకుళం జంక్షన్ ఏప్రిల్ 1, 8, 15, 22
18637 హర్దాయ్ - ఎస్ఎంవీ బెంగళూరు ఏప్రిల్ 6, 13, 20, 27
12835 హర్దాయ్ - ఎస్ఎంవీ బెంగళూరు ఏప్రిల్ 2,7, 9,14,16, 21, 23, 28
12889 టాటా - ఎస్ఎంవీ బెంగళూరు ఏప్రిల్ 5, 12, 19, 26

వచ్చే నెలాఖరు వరకు బెంగళూరు ఎక్స్‌ప్రెస్ పొడిగింపు

నరసాపురం, మార్చి 26:నరసాపురం బెంగళూర్ల మధ్య ప్రతి శుక్రవారం నడుస్తున్న వీక్లి ఎక్స్‌ప్రెస్‌ను ఏప్రిల్ 27 వరకు పొడిగిస్తూ దక్షణ మధ్య రైల్వే ఉత్తర్వులు జారీ చేసింది. రెండేళ్లుగా నడుస్తున్న ఈ ఎక్స్‌ప్రెస్ ఈ నెలాఖరుతో ముగుస్తుంది. మళ్లీ పొడిగించడం లేదంటూ 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తకు రైల్వే అధికారులు స్పందించారు. 07153, 07154 నెంబర్లతో ఈనెల 29 నుంచి ఈ ఎక్స్‌ప్రెస్ యథావిధిగా నడుస్తుందని ప్రకటించింది. నరసాపురం నుంచి వచ్చేనెల 5, 12, 19, 26 తేదీల్లో, తిరుగు ప్రయాణంలో బెంగుళూరు నుంచి ఈనెల 30, ఏప్రిల్ 6, 13, 20, 27 తేదీల్లో ఈరైలు నడవనుంది. మంగళవారం నుంచే ఆన్‌లైన్ రిజర్వేషన్ బుకింగ్ అందుబాటులోకి తెచ్చింది. పాలకొల్లు, భీమవరం టౌన్, కైకలూరు, విజయవాడ, ఒంగోలు, రేణుగుంట, కాట్‌పాడి మీదుగా బెంగుళూరుకు వెళ్లనుంది..

వారికి వద్దు...వీరికి ముద్దు !

'పది' జవాబుపత్రాల మూల్యాంకన విధులకు వింత పరిస్థితులు

యువ టీచర్లకు నడుం నొప్పులట.. అరవైఏళ్ల ఉపాధ్యాయుల్లో ఆసక్తి



ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 26 : పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనానికి జిల్లాలో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. మూడుపదుల వయస్సుగల సబ్జెక్టు నిపుణులు జవాబు పత్రాలను దిద్దేందుకు పలు 'అనారోగ్య' కారణాలను సాకుగా చూపుతూ మినహాయింపుల కోసం అభ్యర్థిస్తుండగా, అరువదుల వయస్సులోనూ ఆన్సర్ స్క్రిప్టులను మూల్యాంకనం చేసేందుకు తాము పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నామంటూ స్పాట్ విధులకు ముందుకు వస్తుండడం జిల్లావిద్యాశాఖ అధికార వర్గాలను సైతం ఆశ్చర్యపరుస్తోంది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 8వ తేదీ వరకు జరగనున్న టెన్త్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనకు ఏలూరు జిల్లాలో అసిస్టెంట్ ఎగ్జామినర్లు 785 మంది ఆయా సబ్జెక్టుల్లో నిపుణత గల టీచర్లు, 133 మంది చీఫ్ ఎగ్జామినర్లు, మార్కులను లెక్కించి నమోదు చేసేందుకు వినియోగించే 266 మంది స్పెషల్ అసిస్టెంట్లు (చెకర్)ల నియామకాలకు జిల్లావిద్యాశాఖ చర్యలు చేపట్టింది. వివిధ తీవ్ర అనారోగ్య కారణాలు, వయస్సు 59 నుంచి 62 ఏళ్ల వరకుగల సీనియర్ టీచర్లను మానవతా దృక్పథంతో స్పాట్ విధుల నుంచి ముందుగానే మినహాయింపులను ఇచ్చారు. మరోవైపు ఆయా సబ్జెక్టుల్లో కనీసం మూడేళ్ల బోధనానుభవం గల ఉపాధ్యాయులనే మూల్యాంకన విధు లకు నియమించాలని నిర్ణయించి ఆ మేరకు అర్హుల జాబితాలను ఇటీవల విడుదల చేశారు. దీంతో పలువురు టీచర్లు తాము స్పాట్ విధులు చేయ లేమంటూ మినహాయింపుల కోసం డీఈవో కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు ప్రారంభించారు. కొందరైతే తమకు తెలిసిన వారితో రికమండేషన్‌లను తీసుకొచ్చారు. తీరా ఇటువంటి అభ్యర్థనలను పరిశీలిస్తే దాదాపు మినహాయింపు కోరిన వారందరూ 28 ఏళ్ల నుంచి 32 ఏళ్ల లోపువారు ఉండడం, అందులోనూ వీరిలో పలువురు తాము నడుమునొప్పి, కీళ్లనొప్పులతో ఉన్నా మంటూ కారణాలుగా చూపడంతో డీఈవో కార్యాలయవర్గాలు అవాక్క య్యాయి. మరికొందరైతే సంబంధిత రోగాలు, రుగ్మతలతో బాధ పడుతున్నామంటూ వైద్య ధ్రువీకరణపత్రాలు సమర్పించడం గమనార్హం.

స్పాట్ ఆర్డర్లు జారీ

మూల్యాంకన విధులకు అవసరమైన బోధనా సిబ్బంది సంఖ్యకు అదనంగా 50 శాతం మందిని ముందు గానే గుర్తించినందున ఎటువంటి ఇబ్బందులు తలెత్తే అవకాశం లేదని డీఈవో కార్యాలయ అధికారులు వివరించారు. అయితే సీనియర్లు, జూనియర్లు జవాబుపత్రాలు దిద్దితే మూల్యాంకనలో వ్యత్యాసం ఉంటుం దని, సీనియర్ల వల్ల పారదర్శకత ఉంటుందనే వారూ లేకపోలేదు. ఇదిలా ఉండగా జిల్లాకు ఈ ఏడాది రెండు లక్షల జవాబుపత్రాలు మూల్యాంకనం నిమిత్తం కేటాయించారు. ఈ ఏడాది నుంచి ఒక్కో జవాబు పత్రం మూల్యాంకనానికి ఇచ్చే పారితోషకాన్ని రూ.6.50 పైసల నుంచి రూ.10లకు పెంచినప్పటికీ స్పాట్ విధుల పట్ల టీచర్లు ఆసక్తి చూపకపోవడం విశేషం. కాగా అనారోగ్య కారణాలు, ఇతర కారణాలతో మినహాయింపులు పోను మిగతావారికి మంగళవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత స్పాట్ విధులకు నియామక పత్రాలను జిల్లా విద్యాశాఖ విడుదల చేయడానికి తుదిచర్యలు చేపట్టింది. ఇకమీదట ఎవరి నుంచీ మినహా యింపునకు అభ్యర్థన లేఖలను స్వీకరించబోమని, 59 ఏళ్ల వయస్సు దాటినందున తామే మినహాయింపునిచ్చిన సీనియర్ ఉపాధ్యాయుల్లో ఎవరైనా స్పాట్ విధులు నిర్వర్తించేందుకు ముందుకొస్తే ఆహ్వానిస్తున్నట్టు డీఈవో అబ్రహం వెల్లడించారు.

సోమేశ్వరుడికి వెండి జటాజూటం




జటాజూటం అందిస్తున్న దృశ్యం.. (ఇన్‌సెట్‌లో) స్వామివారికి అలంకరణ

కాళ్ళ, మార్చి 26 : కాళ్ళ గ్రామానికి చెందిన గ్రంధి సోమయ్య, అన్నపూర్ణ దంపతుల కుటుంబం మంగళవారం శ్రీగంగా పార్వతి సమేత సోమేశ్వరస్వామి ఆలయానికి వెండి జటాజూటం అందించారు. వీటి విలువ సుమారు రూ.2,50,000 ఉంటుందని ఈవో కూచంపూడి శ్రీనివాసరాజు తెలిపారు. అనంతరం దాతలను ఆలయన ఛైర్మన్ గనిశెట్టి షణ్ముకేశ్వరరావు, పాలకమండలి సభ్యులు సత్కరించారు.

శ్రీవారికి 140 గ్రాముల వెండి యజ్ఞోపవీతం



భీమవరం టౌన్, మార్చి 26 : భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి మందిరంలోని ఉత్సవ విగ్రహానికి వెండి యజ్ఞోపవీతం దాతలు మంగళవారంనాడు అందజేశారు. పట్టణానికి చెందిన అల్లం రమేష్ దంపతులు వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారి ఉత్సవ విగ్రహానికి 140 గ్రాముల వెండితో తయా రుచేసిన యజ్ఞోపవీతం అందజేసినట్లు ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు తెలిపారు. ఆలయ అర్చకులు శ్రీనివాస్ చార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించి దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

కుట్టుమిషన్ అందజేత

భీమవరం అర్బన్, మార్చి 26: మానవత సాంఘిక సేవా సంస్థ భీమవరం మండల శాఖ ఆధ్వర్యంలో భర్తను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మహిళకు మంగళవారం కుట్టుమిషను అందజేశారు. సంఘ సేవకులు అల్లు శ్రీనివాస్, మానవత సంస్థ సభ్యులు చేకురి ఝాన్సీ, కారుమూరి నరసింహమూర్తి పాల్గొన్నారు.

పిల్లలకు ఉచిత గుండె వైద్య పరీక్షలు

భీమవరం అర్బన్, మార్చి 26: భీమవరం మెంటేవారితోటలోని ఏఎస్‌ఆర్‌బీవీకె వైద్య సహాయ కేంద్రంలో వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. చిన్నపిల్లల గుండె వైద్య నిపుణులు డా. విక్రమ్ పది మంది చిన్నారులకు 2డీ ఈకో పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అవసరమైన వారికి ఉచిత గుండె శస్త్ర చికిత్సలు నిర్వహించడం జరుగుతుందని వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ప్రసాదరాజు తెలిపారు.

తాగునీరు దుర్వాసన



నాచు పట్టిన మంచినీటి చెరువు

ఆకివీడు, మార్చి 26: తాగునీటి సమస్యతో పట్టణ ప్రజలు అల్లాడుతున్నారు. ఆనాల మంచినీటి చెరువు నుంచి పట్టణ పరిధిలోని కొన్ని వార్డులకు కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. చెరువులో నాచు తొలగించకుండా ఫిల్టర్ చేసి కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న మంచినీరు దుర్వాసన వస్తున్నాయని పలువురు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

వాహనాల తనిఖీ



మొగల్తూరు, మార్చి 26: ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. మొగల్తూరు జాతీయ రహదారిపై వెళ్ళే వాహనాలను పోలీసులు, మండల పరిషత్ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నారు. మంగళవారం మొగల్తూరు గాంధీబొమ్మల సెంటర్‌లో ఆటోలు, ఇతర వాహనాలను మొగల్తూరు ఏఎస్ఐ యు.రాజేంద్ర, టీమ్ లీడర్ ఎం.శాంతి మౌనికలు తనిఖీలు చేశారు.

వచ్చే నెలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు : ఆర్డీవో

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 26: ఏప్రిల్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని ఆర్డీవో చెన్నయ్య పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఆర్‌బీకేల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ రైతులకు సరిపడా గోనెసంచులు ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. ధాన్యం కొనుగోళ్లలో సిబ్బంది ఎలాంటి అలసత్వం వహించినా ఊరుకోమని హెచ్చరించారు. తహసీల్దార్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఆచంట: ధాన్యం సేకరణపై అవగాహన సదస్సు, శిక్షణ కార్యక్రమం మంగళవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద తహసీల్దార్ ఐపీశెట్టి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఏప్రిల్ మొదటి వారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని తెలిపారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. తేమ శాతం 17 శాతం మించకుండా రైతులు కోతలు పూర్తి అయిన వెంటనే ఆరబెట్టుకుని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలన్నారు.

వలంటీర్లపై విమర్శలు తగవు

ఆచంట, మార్చి 26: సంక్షేమాన్ని పేదలకు పారదర్శకంగా అందించిన వలంటీర్లపై తెలుగుదేశం పార్టీ కూటమి నాయకులు విమర్శలు చేయడం దారుణమని ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం తూర్పుపాలెంలోని కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్ చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు.

తల్లిదండ్రులకు ఎస్ఐ కౌన్సెలింగ్

పెనుగొండ, మార్చి 26: యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా మంచి అలవాట్లను అలవరచుకోవాలని ఎస్ఐ షేక్ సుభాని అన్నారు. పెనుగొండ పోలీసు స్టేషన్‌లో ఇటీవల కేసులు నమోదైన పలువురు బాలురు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలు పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత చెడు వ్యసనాలకు అలవాటుపడి చట్ట వ్యతిరేకపనులకు పాల్పడితే తగు చర్యలు తీసుకుంటామన్నారు. వాట్సప్ మెసేజ్‌లలో ఎటువంటి అభ్యంతర మెసేజ్‌లు పెట్ట వద్దని అటువంటి మెసేజ్‌లు పెట్టడం వల్ల కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మరోసారి అవకాశం ఇవ్వండి

నరసాపురం రూరల్, మార్చి 26: నియోజకవర్గంలో పెండింగ్ సమస్యల్ని పూర్తి చేశా. ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమాన్ని అమలు చేశా, మరో సారి నన్ను దీవించండి అంటూ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం మండలంలోని పీఎంలంక గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం తిరుమాని నాగరాజు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పారు.

ఆకట్టుకున్న న్యూట్రిషన్ ఫెస్టివల్

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 26: తాడేపల్లిగూడెం జ్యోతి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్గానిక్ ఫుడ్, న్యూట్రిషన్ ఫెస్టివల్ ఎగ్జిబిషన్ ఆకట్టుకున్నది. 75 రకాల వంటలు తయారుచేసి ప్రదర్శించారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ జీ. భాగ్యం ముఖ్యఅతిథిగా పాల్గొనగా జ్యోతి ఎడ్యుకేషనల్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కరస్పాండెంట్ దత్తు ప్రసాద్ ఆధ్వర్యం వహించారు.

టెన్త్ సైన్స్ పరీక్ష ప్రశాంతం

ఆకివీడు/నరసాపురం రూరల్/పాలకొల్లు అర్బన్/పాలకోడేరు/ మొగల్తూరు/ ఆచంట, మార్చి 26: పదవ తరగతి బయోలాజికల్ సైన్స్ పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగింది. ఆకివీడు మండలంలో నాలుగు సెంటర్లలో 808 మందికి 33 మంది గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు. నరసాపురం పట్టణ, మండలంలో తొమ్మిది కేంద్రాల్లో మంగళవారం జరిగిన పదోవ తరగతి పరీక్షల్లో 41 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో పుష్పరాజ్యం తెలిపారు. పాలకొల్లు పట్టణం రూరల్ మండలంలో 12 కేంద్రాలలో 10వ తరగతి సైన్స్ పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. 138 మంది పరీక్షలకు హాజరు కాలేదని ఎంఈవో కార్యాలయ అధికారి తెలిపారు. పాలకోడేరు మండలంలో 883 మంది విద్యార్థులకు గాను 820 మంది పరీక్షకు హజరయ్యారని, 63 మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. మొగల్తూరు మండలంలోని ఆరు పరీక్షా కేంద్రాల్లో 921 మంది విద్యార్థులు హాజరుకావల్సి ఉండగా 865 మంది మాత్రమే హాజరైనట్టు మండల విద్యాశాఖాధికారి శామ్యూల్ జాన్ తెలిపారు. ఆచంటలో 542 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 14 మంది గైర్హాజరు కాగా 205 మంది ప్రైవేటు విద్యార్థులకు గాను 55 మంది గైర్హాజరైనట్లు ఎంఈవోలు ఎ. ఉషారాణి, వర ప్రసాద్ తెలిపారు.






పుట్టా మహేష్ కుమార్‌ను అభినందిస్తున్న గణపవరం టీడీపీ నాయకులు.. కృష్ణకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న తోట సీతారామలక్ష్మి.. నరసాపురంలో పార్టీలో చేరిన కార్యకర్తలతో జనసేన కన్వీనర్ నాయకర్.. పాలకొల్లులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ అంగర

కూటమి విజయానికి కలిసికట్టుగా పనిచేయాలి

ఏలూరు పార్లమెంట్ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్



పెంటపాడులో ప్రసంగిస్తున్న జనసేన అభ్యర్థి బొలిశెట్టి

గణపవరం, మార్చి 26: వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు టీడీపీ కూటమి రానున్న ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేయాలని ఏలూరు పార్లమెంట్ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ కోరారు. మంగళవారం పిప్పరలో మండల టీడీపీ కార్యాలయంలో గణపవరం మండల టీడీపీ నాయకులు ఆయనను కలిశారు. రాష్ట్రాభివృద్ధితో పాటు ఏలూరు పార్లమెంట్ అభివృద్ధికి ప్రతీ కార్యకర్త పని చేయాలన్నారు. ఇందుకూరి రామకృష్ణంరాజు, ఉంగుటూరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు, జిల్లా కార్యదర్శి సుబ్బారావు, గణపవరం పట్టణ టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు కాపారం చిన్న, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో జగన్ పాలనకు చరమగీతం: తోట

భీమవరం రూరల్, మార్చి 26 : భీమవరం మండలం వైసీపీ నాయకుడు గుద్దటి కృష్ణ 50 మంది అనుచరులతో తెలుగుదేశం పార్టీలో చేరారు. భీమవరంలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ అసమర్థ పరిపాలనతో విసిగిపోయిన వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలోకి వస్తున్నారని త్వరలోనే జగన్ పాలనకు ప్రజలు చమరగీతం పాడనున్నారని అన్నారు. టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, కార్యక్రమంలో భీమవరం మండల టీడీపీ అధ్యక్షకార్యదర్శులు రేవు వెంకన్న, కౌరు పృథ్విశంకర్, మాజీ ఎంపీపీ బర్రె నెహ్రూ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ నౌండ్రు రాజేంద్రప్రసాద్, మండల ఐటీడీపీ అధ్యక్షుడు బొడ్డు మోహన్, మండల తెలుగుయువత అధ్యక్షుడు కొయ్యలగడ్డ గణపతి పాల్గొన్నారు.

అభివృద్ధిని అటకెక్కించిన వైసీపీ: సూర్యకుమారి

యలమంచిలి, మార్చి 26: రాష్ట్రంలో అభివృద్ధిని అటకెక్కించిన వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు సతీమణి సూర్యకుమారి అన్నారు. శిరగాలపల్లి గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి నిమ్మల సూర్యకుమారి మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకుమారి మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన రామానాయుడుకు మరోసారి విజయాన్ని అందించాలని ప్రజలను కోరారు.

జనసేనలో చేరిక

నరసాపురం రూరల్, మార్చి 26: మండలంలోని చామకూరిపాలెంకు చెందిన సుమారు 100 మంది జనసేన పార్టీలో చేరారు. వీరందరికీ కన్వీనర్ బొమ్మిడి నాయకర్ పార్టీ కండువాలు కప్పారు. కార్యక్రమంలో ధర్మారావు, సత్యనారాయణ, రెడ్డియ్య, రాజేష్, నాగరాజు, రాంబాబు, వెంకన్న, చిట్టిబాబు, వరప్రసాద్ పాల్గొన్నారు.

టిడ్కో గృహాలు పూర్తిచేసి ఉచితంగా ఇస్తాం: ఎమ్మెల్యే నిమ్మల

పాలకొల్లు టౌన్, మార్చి 26: టిడ్కో గృహాలు పూర్తి స్థాయిలో నిర్మాణం చేపట్టి మహిళలు, పేదలకు ఉచితంగా అందిస్తామని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు పట్టణంలోని 22, 23వ వార్డుల్లో ఆయన మంగళవారం మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్‌తో పాటు టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిమ్మల మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం హయాంలో 90శాతం పనులు పూర్తిచేస్తే ఈవైసీపీ ప్రభుత్వం మిగిలిన పనులు చేపట్టకుండా గాలికొదిలేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, రాష్ట్ర టీడీపీ మహిళా ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి, గౌరునాయుడు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'నిజం గెలవాలి' విజయవంతం చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 26: టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్ కోరారు. తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లిలో బుధవారం నాడు ఆమె పర్యటించే ప్రాంతాన్ని టీడీపీ శ్రేణులు మంగళవారంనాడు పరిశీలించాయి. చంద్రబాబు అరెస్టు తట్టుకోలేక మృతిచెందిన టీడీపీ వీరాభిమాని తాడేపల్లి శేఖర్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వస్తున్న ఆమెకు ఘన స్వాగతం పలికేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పార్టీ జిల్లా నాయకులు వాడపల్లి వెంకట సుబ్బరాజు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

హామీల అమలులో మడమ తిప్పిన జగన్: ఆరిమిల్లి

తణుకు, మార్చి 26: హామీల అమలులో 85 శాతం విఫలమైన జగన్‌ను ఇంటికి పంపాలని తణుకు కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మద్య నిషేధం అమలు చేస్తానని చెప్పి, నాసిరకం మద్యం అమ్మకాలతో 35 లక్షల మంది ఆరోగ్యంతో జగన్ చెలగాటమాడారని మండిపడ్డారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తానని తొమ్మిది దఫాలు రేట్లు పెంచారని, దాని వల్ల రూ. 64 వేల కోట్లు ప్రజల సొమ్ము దోచుకున్నారని చెప్పారు. మీటర్లు, మోటార్ల కొనుగోలులో రూ. 15 వేల కోట్లు దోపిడీ జరిగిందన్నారు. మెగా డీఎస్సీ తెస్తానని మాట తప్పారని వివరించారు. ఇసుక రేట్లు నాలుగు రెట్లు పెంచి 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల జీవితాలతో, పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలు పెంచి సామాన్యుల జీవితాలుతో చెలగాటమాడారని అన్నారు.

బొలిశెట్టిని భారీ మెజార్టీతో గెలిపించాలి: వలవల

పెంటపాడు, మార్చి 26: టీడీపీ, జనసేన, బీజేపీ కలసికట్టుగా పనిచేసి ఉమ్మడి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్‌ను జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి పిలుపునిచ్చారు. మంగళవారం పెంటపాడులో ఉమ్మడి పార్టీ సమావేశం నిర్వహించారు. జనసేన కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ అధికార పార్టీ నేతలు మూడు పార్టీల మధ్య చిచ్చు పెట్టేందుకు యత్నాలు చేస్తారని, కలసికట్టుగా పనిచేసి వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టాలన్నారు. నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ మాట్లాడుతూ అవినీతి పాలన అంతం చేసేందుకు రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావాలన్నారు. ఆయా పార్టీల మండల అధ్యక్షులు కిలపర్తి వెంకట్రావు, పుల్లా బాబి, దత్తుప్రసాద్, దాసరి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్ర భవిష్యత్ కాంక్షించి అన్ని వర్గాల ప్రజలు జనసేన పార్టీలో ఉప్పెనలా చేరుతున్నారని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని ఆయన నివాసంలో మంగళవారం పట్టణంలోని 6, 11 వార్డులకు చెందిన పలువురు మహిళలు, యువత జనసేనలో చేరగా ఆయన జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

నేడు మార్కెట్ వేలం పాట

నరసాపురం టౌన్, మార్చి 26: పురపాలక కార్యాలయంలో బుధవారం ఉదయం 11గంటలకు మార్కెట్ వేలం పాట నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వెంకటేశ్వరావు తెలిపారు. ఈనెల 21న నిర్వహించాల్సిన పాటలో పాటదారులు పాడుకునేందుకు ఆసక్తి చూపించకపోవడంతో కమిషనర్ వాయిదా వేసిన విషయం విదితమే.

టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శిగా కొవ్వలి



నరసాపురం, మార్చి 26: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గంలో నరసాపురం పట్టణానికి చెందిన కొవ్వలి నాయుడుకు కీలక పదవి లభించింది. మంగళవారం పార్టీ అధ్యక్షులు అచ్చెన్నాయుడు ప్రకటించిన జాబితాలో కొవ్వలికి పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శిగా పదవి లభించింది. అమెరికాలో ఉంటున్నప్పటికీ పార్టీ ఆదేశించినప్పుడల్లా నియోజకవర్గానికి విచ్చేసి తన వంతు అండగా నిలుస్తూ వచ్చారు. నరసాపురంలో పార్టీ కోసం కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈనేపథ్యంలో టిక్కెట్ తనకే దక్కుతుందని ఆశించారు. అయితే పొత్తులో భాగంగా సీటు జనసేనకు కేటాయించడంతో కొవ్వలి నిరాశ చెందారు. ఈ నేపథ్యంలో కొవ్వలికి రాష్ట్ర కార్యవర్గంలో కీలక పదవిని కట్టబెట్టడంపై తెలుగుతమ్ముళ్ళు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

కళాకారులకు సత్కారం



పాలకొల్లు అర్బన్, మార్చి 26 : యడ్లబజారులోని శ్రీకనక దుర్గమ్మ కల్యాణ ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి షిరిడి సాయి నాట్యమండలి (నరసాపురం)వారిచే చిల్లర కొట్టు చిట్టెమ్మ సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. ఈసందర్భంగా నాటకంలో పాత్రలు పోషించిన స్థానిక పాత్రికేయులు మానాపురం సత్యనారాయణ, కొంతేటి శాంతారావులను ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ కావలి శ్రీనివాసరావు, ట్రస్టీలు, భక్తులు ఘనంగా సత్కరించారు.

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చాం

భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 26 : రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు చేసిన ఘనత ముఖ్యమంత్రికి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని వైసీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, ఎమ్మెల్యే అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం భీమవరం పట్టణంలోని ది భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో జరిగిన ఛాంబర్ జనరల్ బాడీ సమావేశంలో ఇరువురు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఏవీఆర్ సభాపతి, కార్యదర్శులు ఆర్‌వీ ప్రసాద్, కాగిన రమణ, వైసీపీ యువ నాయకులు గ్రంధి రవితేజ పాల్గొన్నారు.

అర్చకుల మీద దాడి హేయమైన చర్య



పాలకొల్లులో విలేకరులతో మాట్లాడుతున్న అర్చక సంఘ నాయకులు

కాళ్ళ, మార్చి 26 : కాకినాడ దేవాలయం వీధిలోని భీమేశ్వరస్వామి దేవాలయం అర్చకులపై వైసీపీ నాయకుడు దాడి చేయడం హేయమైన చర్య అని ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు పొదిల నారాయణమూర్తి ధ్వజమెత్తారు. మంగళవారం ఏలూరుపాడులో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ మాజీ కార్పొరేటర్ సిరియాల చంద్రరావు దేవాయలంలో పనిచేస్తున్న అర్చకుడిపై దాడి చేసి దూషించడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం స్పందించి అర్చకులపై జరుగుతున్న దాడులపై విచారణ జరిపి చర్యలు తీసుకోకపోతే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోవల్సి వస్తుందన్నారు. సమావేశంలో సమాఖ్య గౌరవాధ్యక్షులు యామిజాల నరసింహమూర్తి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి శేషు పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్: కాకినాడలో అర్చకునిపై దాడిని పట్టణంలోని పురోహిత, అర్చక సంఘం నాయకులు, బ్రాహ్మణ మహిళా సంఘ నాయకులు ఖండించారు. బ్రాహ్మణ సాధికార సమితి నియోజకవర్గ కన్వీనర్ పెండ్యాల భవానీ మాట్లాడుతూ అర్చకునిపై దాడి చేసిన వ్యక్తిని చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవానీ నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాజకీయాలకు అతీతంగా ప్రతీ బ్రాహ్మణుడు ఏకం కావలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో యల్లావర్థుల రాజేశ్వరి, భాగవతుల పద్మ, గోమఠం హేమ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద పురోహిత, అర్చక సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

నేడు శ్రీనివాసవర్మకు స్వాగత ఏర్పాట్లు

భీమవరం టౌన్/ఉండి, మార్చి 26: నరసాపురం పార్లమెంట్ బీజేపీ, తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థి భూపతి రాజు శ్రీనివాస వర్మ భీమవరానికి విచ్చేస్తున్న సందర్భంగా బుధవారం ఆకివీడు ఉప్పుటేరు బ్రిడ్జి, కాటన్ పార్కు వద్ద స్వాగతం ఏర్పాట్లు చేస్తున్నట్టు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ తెలిపారు. భారీ ర్యాలీతో అక్కడ నుంచి ఉండి మీదగా భీమవరంలో ఉన్న పార్లమెంట్ ఎన్నికల కార్యాలయం వరకు ఉంటుందని తెలిపారు. భూపతిరాజు శ్రీనివాసవర్మ కార్యక్రమం విజయవంతం చేయాలని నరసాపురం పార్లమెంటు కన్వీనరు పేరిచర్ల సుభాస్‌రాజు, ఉండి బీజేపీ అసెంబ్లీ కన్వీనరు కోరా రామ్మూర్తి, కోకన్వీనరు గాదిరాజు వెంకటేశ్వరరాజు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ నాగాబులు కోరారు.

ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలి: కలెక్టర్

భీమవరం, మార్చి 26: ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఎన్నికల కమాండ్ కంట్రోల్ సిబ్బందితో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సమావేశమై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మా ట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రజలనుంచి ఫిర్యాదులను స్వీకరించేందుకు వివిధ వ్యవస్థలను అందుబాటులో ఉంచడం జరిగిందన్నా రు. ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు ఇవన్నీ దోహదప డతాయని తెలిపారు.

ఎన్నికల ప్రచారానికి అనుమతి తప్పనిసరి: జేసీ

ఉండి, మార్చి 26: ప్రచారాలు, సభలు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరి అని జిల్లా జాయింట్ కలెక్టరు, ఉండి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రవీణ్ ఆదిత్య అన్నారు. మంగళవారం ఈమేరకు ఒక ప్రకటనలో వివరాలను తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో వున్నందున ఇంటింటి ప్రచారం చేయాలన్నా రోడ్‌షో సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ర్యాలీలతో పాటు అక్కడ వాడే లౌడ్ స్పీకర్లతో కూడిన వాహనాలకు, కరపత్రాలు పంపకం, జెండాలు, ఆ్యనర్లు, పోష్టర్లు, హోర్డింగులు, ప్రదర్శనకు తాత్కాలిక రాజకీయపార్టీల కార్యలయాల ప్రారంభోత్సవాలకు, ప్రచార వాహనాలకు అనుమతులు తీసుకోవాలన్నారు.

ఆచంట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉందని ఆచంట ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రచారం, రోడ్డు షోలు, సభలు సమావేశాలకు మైక్‌లో ప్రచారానికి 48 గంటలు ముందు అనుమతి తీసుకోవాలన్నారు. అందుకోసం సువిధ యాప్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సంబంధిత పత్రాలను రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోఅందజేయాలన్నారు. ఇతర వివరాలకు సువిధ టీమ్ అధికారి వి. పూర్ణ బాబ్జి, సెల్‌నెం. 99635 90272కు సంప్రదించాలన్నారు.

సేవకు ప్రతిరూపం లయన్స్ క్లబ్

భీమవరం టౌన్, మార్చి 26 : సేవకు మరోరూపం లయన్స్‌క్లబ్ అని, ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తంలా తమ క్లబ్ ముందు ఉంటుందని క్లబ్ డిస్ట్రిక్టు గవర్నర్ ఘట్టం మాణిక్యాలరావు అన్నారు. మాణిక్యాలరావు భీమవరం లయన్స్ క్లబ్ విజిట్ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. కనగర్ల కిషోర్ సహాయంతో ఉచితంగా మందులను మునిసిపల్ స్కూల్లో పిల్లలకి డాక్టర్ మౌనిక చిల్డ్రన్ స్పెషలిస్ట్ పరీక్షల అనంతరం అందజేశారు. గవర్నమెంట్ హాస్పిటల్లో రోగులకు పండ్లు పంపిణీ, పేదలకు గ్రైండర్స్, సైకిళ్ళు, దుప్పట్లు, చీరలు అందజేశారు.

'సమాజంలో అసమానతలు పెరిగాయి'

భీమవరం టౌన్, మార్చి 26: సమాజంలో కుల వ్యవస్థ వల్ల నిమ్న కులాలను బలహీనపరిచిందని ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గరికిముక్కుసుబ్బయ్య అన్నారు మంగళవారం భీమవరం బార్ అసోసియేషన్ ప్రాంగణంలో భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముగ్గళ్ళ వెంకటరమణ రావుచే ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక సమాచార బులెటిన్ ఆవిష్కరణ చెయ్యగా ఆయన మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు న్యాయవాది చింక వెంకట సూర్యనా రాయణ అధ్యక్షత వహించారు.

శ్రీవారి హుండీల ఆదాయం లెక్కింపు

భీమవరం టౌన్, మార్చి 26 : జువ్వలపాలెం రోడ్డులోని పద్మావతి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారంనాడు హుండీలను లెక్కించగా 8లక్షల 97వేల 736 రూపాయలు ఆదాయంగా వచ్చిందని ఈవో ఆర్.గంగా శ్రీదేవి తెలిపారు. 180 రోజులకు గాను భక్తులు స్వామివారిని దర్శించుకుని హుండీలో వేసిన కానుకలను లెక్కించారు.

ఓటు వినియోగంపై సదస్సు

తణుకు, మార్చి 26: తణుకు ఆర్టీసీ డిపో గ్యారేజ్ సిబ్బందికి ఓటు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళవారం గ్యారేజ్ వద్ద జానపద కళాజాత ద్వారా వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. జిల్లా స్వీప్ నోడల్ అధికారి గంటా చిన ప్రభాకర్, డిపో మేనేజర్ సప్పా గిరిధర్‌కుమార్, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య సేవలు

తణుకు, మార్చి 26: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, జనరిక్ మందుల షాపు సంయుక్తంగా వారం వారం వృద్ధులకు నిర్వహించే ఉచిత వైద్య సేవలు డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు నిర్వహించారు. మంగళవారం సంఘ కార్యాలయంలో 31 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, సంఘ కార్యదర్శి కోసూరి గాంధీ, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కవాతు



భీమవరం క్రైం, మార్చి 26 : ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహణకు ప్రజలంతా సహకరించాలని డీఎస్పీ నారాయణ స్వామి కోరారు. మంగళవారం నాడు డీఎస్పీ, వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను, 70మంది సెంట్రల్ ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులతో సర్పయ్య అగ్రహారం నుంచి మెంటేవారి తోట వరకు పోలీసులు కవాతు నిర్వహించారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి నివారించాలి

యలమంచిలి, మార్చి 26: అధికారులు సమన్వయంతో పనిచేసి వేసవి దృష్ట్యా మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తక్షణమే చేపట్టాలని ఎంపీడీవో పి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఎంపీడీవో పి.శ్రీనివాసరావు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లోని మంచినీటి చెరువులను నింపేందుకు నిర్దిష్టమైన కార్యాచరణ రూపొందించి తదనుగుణంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్యనిపుణులు

పెంటపాడు, మార్చి 26: అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 28న రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు వస్తున్నట్టు ట్రస్టు ఛైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. జనరల్, చిన్నపిల్లల, స్త్రీల వ్యాధుల, క్యాన్సర్, గుండె సంబంధ వైద్య నిపుణులు వస్తున్నారన్నారు. అవసరమైన వారికి అన్ని రకాల రక్త పరీక్షలు, ఈసీజీ, టూడీ ఎకో, అల్ట్రాసౌండ్ పరీక్షలు ఉచితంగా చేస్తారని ప్రజలంతా వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హెచ్ఐవీ పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ

ఆకివీడు, మార్చి 26: ఆకివీడు లయన్స్ క్లబ్, వైఆర్జీ కేర్‌ల సంయుక్త ఆధ్వర్యంలో హెచ్ఐవీ బాధిత పిల్లలకు పౌష్టికాహారం, దుప్పట్లు మంగళవారం లయన్స్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎంవీఎస్ రాజు, క్లబ్ అధ్యక్షుడు వేగేశ్న వెంకట కృష్ణంరాజు పాల్గొన్నారు.

అంజిబాబు సతీమణి ప్రత్యేక పూజలు

వీరవాసరం, మార్చి 26: భీమవరం నియోజవర్గ ఉమ్మడి కూటమి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) సతీమణి సత్యవాణి మంగళవారం రాయకుదురు గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రాయకుదురు మావుళ్ళమ్మ అమ్మవారి ఆలయం, పద్దాల వెంకమ్మ, మానసాదేవి ఆలయాల్లోనూ ఈ పూజలు జరిపారు. అనంతరం గ్రామంలోని మహిళలను కలిశారు. ఈ సందర్భంగా మహిళలు ఆమెకు సంఘీభావం తెలియచేస్తూ సత్కరించారు. ఎంపీపీ ఉపాధ్యక్షుడు అడ్డాల రామచంద్రరావు(రాము), మాజీ సర్పంచ్‌లు గన్నమనీడి జయప్రసాద్, కవురు భాస్కరరావు , మల్లు శ్రీనివాస్, శీలబోయిన రాజు, తోట బుజ్జి, ఆకుల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

30న బార్ ఎన్నికలు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 26: తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్‌ల ఘట్టం మంగళవారం ముగిసింది. ఈ నెల 30న ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు పీతల సుధాకర్, పుట్టా వేణుగోపాల చౌదరి, మరపట్ల అజయ్, గుత్తికొండ శ్రీనివాసరావు నిర్ణయించారు. అధ్యక్ష పదవికి ఐదుగురు, ఉపాధ్యక్ష పదవికి ముగ్గురు, ప్రధాన కార్యదర్శి స్థానానికి ముగ్గురు, కోశాధికారి పదవికి ఇద్దరు నామినేషన్‌లు దాఖలు చేశారు.

స్కిన్నెరపురంలో దళిత గళం

అత్తిలి, మార్చి 26: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టే సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తున్నామని జడ్పీటీసీ మాజీ సభ్యు రాలు ఎం. కృష్ణ కుమారి అన్నారు. స్కిన్నెరపురం ఎస్సీ కాలనీలో దళిత గళం నిర్వహించారు. వైసీ పీ ప్రభుత్వంలో దళితుల కు జరిగిన అన్యాయాలను వివరించారు.

